క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ

కాశీబుగ్గ: నూతనంగా ఎన్నికైన పలాస బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎస్.విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, సంయుక్త కార్యదర్శి జీఎంఎస్ అనీల్‌రాజు, సభ్యుడు వై.హేమకుమార్‌లను జడ్జి అభినందించారు. పలాస నూతన కోర్టు నిర్మాణ విషయంపై ఆయనతో మాట్లాడగా తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సన్యాసి నాయుడు, లోక్ అదాలత్ పర్మినెంట్ మెంబర్ సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోగులాంబ ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం గోపినాథపురంలో గ్రామ దేవత గోగులాంబ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి ఘటాలతో చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే సూర్యమణిపురం గ్రామంలో నీలమ్మతల్లి, గూనరమ్మతల్లి ఉత్సవాలు సైతం వైభవంగా చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేషన్ వాహనం తనిఖీ

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు సచివాలయం పరిధిలో ఎండీయూ రేషన్ వాహనాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ మంగళవారం తనిఖీ చేశారు. రేషన్ సరఫరా తీరుపై ఎండీయూ ఆపరేటర్ సనపల వెంకటరమణ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. ఆయనతో పాటు సివిల్ సప్లయ్ డీటీ కె.రాము ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ అన్నారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామంలో మంచినీటి బోర్‌కు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎం.పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గూడ ఈశ్వరరావు, కె.వరలక్ష్మి, ఎం.హిమవతి, ఆర్.భాస్కరరావు, ఎం.చంద్రభూషణ్, ఎం.దాలయ్య, ఆర్.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం ఏర్పాటుకు శంకుస్థాపన



స్మృతివనం భూమిపూజ చేస్తున్న వెంకటరమణారావు తదితరులు

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహంతో పాటు స్మృతివనం ఏర్పాటు చేసేందుకు జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు మంగళవారం భూమిపూజ చేశారు. పలువురు విద్యావంతులు, ఉద్యోగులు, న్యాయవాదులు, నాయకుల విరాళాలతో సుమారు రూ.5 లక్షల వ్యయంతో బొడ్డేపల్లి స్మృతివనం నిర్మించనున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెపు రామారావు, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, పేడాడ వెంకటరావు, బమ్మిడి గణపతి, కె.కృష్ణమూర్తి, ఎంపీటీసీ పంకు రామం, వాన లక్ష్మి, న్యాయవాది లఖినేని శ్రీనివాస్, ఏపీటీఎఫ్ నాయకుడు జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం'

మందస: బీజేపీ వ్యతిరేక శక్తులన్నింటినీ కలిపి ఐక్య పోరాటం చేయనున్నట్లు భారత్ బచావో ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మండలంలోని హరిపురం మార్పు గ్రంథాలయం వద్ద భారత్ బచావో కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్ బచావో ఐక్య సంఘటన, స్వభావం కలిగిన వేదిక ఏర్పాటు చేసి, భిన్న భావజాలాలు కలిగిన శక్తులన్నింటినీ సమీకరించి ఉమ్మడి శత్రువైన బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 11న టెక్కలిలో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, డీటీఎఫ్ నాయకులు కోత ధర్మారావు, నల్ల హడ్డి, సీఎల్సీ నాయకుడు ఉగ్రసెల్లి సోమనాథం, డొక్కరి వీరాస్వామి, కేఎస్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్‌కు సత్కారం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్మీడియెట్ హెచ్‌ఈసీ గ్రూపులో 925/1000 మార్కులతో ప్రతిభ కనపరిచిన ఇప్పిలి చామంతిని మంగళవారం సత్కరించారు. చరిత్ర అధ్యాపకులు కొండల మధుబాబు ఆధ్వర్యంలో విద్యార్థి స్వస్థలం మెళియాపుట్టి మండలం జోడూరులో ఇంటివద్ద తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు పట్ట తవిటయ్య, తల్లిదండ్రులు సంజీవరావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



వీధుల్లో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలు



అమ్మవారి వేషధారణలో ఓ కళాకారుడి ప్రతిభ



ఆకట్టుకుంటున్న అమ్మవారి వేషధారణలు



మందస ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తదితరులు



ఉత్సవాల్లో ఆకట్టుకున్న పగటి వేషధారులు

అన్నపూర్ణేశ్వరి నమోస్తుతే

- ముగిసిన మందస ఉత్సవాలు

మందస గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం భక్తులు భారీ ఎత్తున అన్నపూర్ణమ్మ తల్లిని దర్శించుకున్నారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మందస రాజుల వారసుడు కల్నల్ ఛత్రపతిసింగ్‌దేవ్, ఆయన కుమారుడు, భార్య ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామదేవత అన్నపూర్ణమ్మ తల్లిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఆధ్యాత్మిక, సాంస్కృతికత మందసలో వెల్లివిరిసింది. సాయంత్రమయ్యే సరికి జనజాతర ప్రారంభమై, రాత్రి 12 గంటలైనా సందడిగా ఉండేది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, పోలీసులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు చర్యలు తీసుకున్నారు.

- మందస



అన్నపూర్ణమ్మ తల్లిని దర్శించుకున్న మందస రాజుల వారసులు

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

- పనిచేయని వలంటీర్లను తొలగించండి
- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తెలియజేశారు. టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి సూచనల మేరకు వార్డు స్పందన కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించారు. దీనిలో భాగంగా టెక్కలి పరిధిలోని 20 వార్డుల ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించనున్నారు. ముందుగా మొదటి నాలుగు వార్డులకు సంబంధించి స్థానిక ఎన్టీఆర్ కాలనీ పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వార్డులకు సంబంధించి 32 మంది వలంటీర్లు ఉండగా, వారిలో 12 మంది సమావేశానికి గైర్హాజరు కావడంపై సబ్ కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశాలకే రానివారు ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి తొలగించాలని పంచాయతీ అధికారి బొడ్డేపల్లి రామారావు, కార్యదర్శి కూన వినోద్ కుమార్‌లను ఆదేశించారు.

అధికారుల దృష్టికి పలు సమస్యలు

ఈ సందర్భంగా వార్డు మెంబర్లు ఎస్.రాజేశ్వరరావు, డి.పోలయ్య, వైశ్యరాజ్ అశోక్, డి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ తమ వార్డుల పరిధిలోని కాలువలు శుభ్రం చేయాలని, తమ ప్రాంతంలో ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండిపోయి దోమలు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పోలీసుస్టేషన్ వెనుక భాగం నుంచి రోడ్డు కావాలని, లోవోల్టేజ్ సమస్య అధికంగా ఉందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి 33కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందని, త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన వినతులను తీసుకొని వెంటనే సంబంధిత అధికారులు ద్వారా ప్రజలకు వివరణ ఇప్పించారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వీఆర్వో కొండలరావు శతపతి ప్రజలు అడిగిన దానికి సక్రమంగా సమాధానం చెప్పడం లేదని కొంతమంది మహిళలు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మరోసారి ఫిర్యాదు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం దువ్వాడ వాణి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పథకాల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా, సమస్యలు నేరుగా పరిష్కరించడానికే వార్డు స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్ గొండేల సుజాత, మండల పరిషత్ కార్యాలయ ఏవో హనుమంతు వెంకట రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సోంపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- పలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

కంచిలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల కేంద్రం కంచిలి-1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాకరాపల్లి, దాకరాపల్లి కాలనీల్లో పర్యటించి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు జోగేశ్వర చౌదరి, సీహెచ్ రాజు, డొక్కరి కొగయ్య తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని కొర్లాం సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులు ఎవరికైనా సాంకేతిక సమస్యలతో పథకాలు అందకపోతే, వెంటనే సమస్యను పరిష్కరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్. రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, పార్టీ నాయకులు బంగారు పాపారావు, తామాడ మోహన్, కోటీ్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న దువ్వాడ వాణి

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి
- అయోధ్యపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

టెక్కలి రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమం చేరిందని టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అయోధ్యపురం, సుఖదేవ్‌పేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సుఖదేవ్‌పేట గ్రామానికి చెందిన బొడ్డు కాంతమ్మ అనే మహిళ రెండు కాళ్లు కదల్చలేని పరిస్థితిలో ఉండడంతో ఆమెను ఆప్యాయంగా పలకరించారు. ఆమెకు ఆయుర్వేద వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయుకులు మాజీ ఎంపీపీ రాఘవరావు ద్వార, ఎంపీపీ ఎ.సరోజినమ్మ, సర్పంచ్ అన్నెపు శోభారాణి, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, మొర్రి శంఖర్, కె.కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ఐకమత్యానికి ప్రతీక



కాశీనగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని నగరంపల్లి పంచాయతీ పరిధి కాశీనగర్, నువ్వలరేవులో వెలసిన పోలమ్మతల్లి ఉత్సవాలు, మోట్టూరు పంచాయతీ పరిధి ఒంకులూరులో వెలసిన కొండ మహంకాళి అమ్మవారి ఉత్సవాల్లో మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, పార్టీ నాయకులు వంక నాగేశ్వరరావు, ఉంగ సాయి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.45 వేల ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం కూర్మనాథపురం గ్రామానికి చెందిన చింత జోగారావు కుటుంబానికి తోటి మిత్రులు మంగళవారం రూ.45 వేలు ఆర్థిక సాయం చేశారు. జోగారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందంతో ఆ కుటుంబానికి అండగా నిలిచి ఆదుకోవాలని తలచి 2002-03 ఏడాదిలో 10వ తరగతి చదువుకున్న జోగారావు క్లాస్‌మేట్స్ అంతా కలిసి మంగళవారం గ్రామానికి వెళ్లి సాయం అందించారు.

సంక్షిప్తంగా..

50 మందికి కంటి పరీక్షలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సత్యసాయి సేవా మందిరంలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ రాజు, సత్యసాయి శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జ్ జామి చిరంజీవి శ్రీనివాస్, కనీ్వనర్ జగదీష్, శరత్, కృష్ణవంశీ, కృష్ణస్వామీ, రామేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నువ్వలరేవులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు పంచాయతీ నిధులతో సుమారు రూ.40 వేలు విలువ చేసే వంట సామగ్రిని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యజ్ఞా, దేవా, త్రినాథ్, రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు నీలాంబర్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి



ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కాశీబుగ్గ బస్టాండ్‌లో ఉద్దాన రైతులకు స్థలం కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ సూచించారు. మంగళవారం ఉద్దాన రైతు మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దాన ప్రాంతంలో సేకరించిన ఉత్పత్తులను మహిళా రైతులు తెచ్చి అమ్ముకునేందుకు ఎటువంటి ఆటంకం కల్పించకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి పద్మ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. ఈమెకు ముగ్గురు చిన్నారులు ఉన్నారు. తల్లి కోల్పోవడంతో ప్రస్తుతం పిల్లలు కుటుంబ సభ్యుల వద్ద ఉంటున్నారు. దీనికి స్పందించిన కేశుపురం కాళీమాత సేవా సమితి సభ్యులు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

రక్షణ గోడ నిర్మాణానికి భూమిపూజ

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ పరిధి లక్కవరం గ్రామంలో పాత చెరువు రక్షణ గోడ నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుల భాగస్వామ్యం అవసరం

ఇచ్ఛాపురం రూరల్: సమాజ సేవలో యువత భాగస్వామ్యం అవసరమని సర్పంచ్ పాతిర్ల రాజశేఖర రెడ్డి అన్నారు. మండలంలోని తేలుకుంచిలో యువ భారత్ సేవా ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా వృద్ధులకు పండ్లు, రొట్టెలు, ఆహార పొట్లాలు అందజేశారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం

కవిటి: క్రీడలతో యువకుల మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య అన్నారు. మండలంలోని శావసానపుట్టుగ శ్యామలమ్మ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అల్లేరు క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రోయిన్ పనులు వేగవంతం

ఇచ్ఛాపురం రూరల్: రాబోయే ఖరీఫ్ నాటికి కేశుపురం, బూర్జపాడు, డొంకూరు పంచాయతీల రైతులకు సాగునీరు అందించేందుకు గ్రోయిన్ పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ ఏఈ మధుసూదన పాణిగ్రాహి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఈదుపురం బాహుదానదిపై నిర్మిస్తున్న కేశుపురం న్యూ గ్రోయిన్ పనులను పర్యవేక్షించారు. పనులు నాణ్యవంతంగా ఉండాలని కంట్రాక్టర్లకు సూచించారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

కవిటి: ఉపాధి పనులు పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులపైనే ఉందని కవిటి ఎంపీపీ కడియాల పద్మ, ఫైనాన్స్ మేనేజర్ పి.స్వరూపరాణి అన్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై 16వ సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ప్రధానంగా లండారిపుట్టుగ, గొర్లెపాడు ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ వేతనదారులు ఫిర్యాదులు చేశారు. పనుల కల్పనలో తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ బి.లవరాజు,హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏపీవో కడియం భాస్కరరావు, ఎస్ఆర్‌పీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రోణంకి సీతారామనాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పలాస బదిలీపై వచ్చారు. ఇదివరకు పనిచేసిన వేదుల శ్రీనివాసరావు పాడేరు డిపోకి బదిలి అయ్యారు.

మెప్మా సీఎంఎంగా మోహనరెడ్డి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మెప్మా సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం)గా పిన్నింటి మోహనరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఇదివరకు శ్రీకాకుళం సీఎంఎంగా పనిచేశారు.

పరామర్శ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 18వ వార్డు కౌన్సిలర్ చిడిపోతు జగన్నాయకులు కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పరామర్శించారు. 18వ వార్డు కౌన్సిలర్ తండ్రి చిడిపోతు జోగయ్య ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

పాఠశాల ప్రారంభం రోజే జేవీకే పంపిణీ

ఇచ్ఛాపురం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ సూచించింది. పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన జేవీకే స్టాక్ పాయింట్‌ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు, సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారం

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధి ప్రధానపుట్టుగ గ్రామంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలతో కలిసి సర్పంచ్ జగబంధు దొళాయి పర్యటించారు. ఇక్కడ డ్రైనేజీ సమస్య వేధిస్తోందని స్థానికులు చెప్పడంతో వెంటనే కొత్త డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు నీలంబర్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

కంచిలి: వలంటీర్లు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని బూరగాం, తలతంపర, మండపల్లి పంచాయతీల్లో ఖాళీగా ఉన్నటువంటి వలంటీర్ పోస్టులకు నియమించినవారికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో తదితరులు పాల్గొన్నారు.